


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 10 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 83 పేజీలు : 4 వెల : రూ 3-00


# విద్యార్థుల ధర్నాలో దుండగులు: మంత్రి సురేష్

## అనంతపురం కాలేజీ ఘటనపై తప్పుడు ప్రచారం
## మంత్రి ఆదిమూలపు సురేష్




విజయవాడ: అనంతపురంలో కాలేజీ ఘటనపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. విద్యార్థుల ధర్నాలో కొందరు దుండగులు చొరబడ్డారన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పోలీసులపై రాళ్లు రువ్వి విద్యార్థిని గాయపర్చారన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారని వివరించారు. కొన్ని రాజకీయ పార్టీలు వీటిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. అవాస్తవ ప్రచారానికి కొన్ని మీడియా సంస్థలు మద్దతు పలుకుతున్నాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. విద్యార్థినిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. పోలీసులు లాఠీచార్జ్ చేయలేదంటూ బాధిత విద్యార్థినే చెబుతోందని మంత్రి అన్నారు. దుండగులు వేసిన రాళ్ల దాడిలోనే విద్యార్థిని గాయపడిందన్నారు. రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థల పనితీరుపై కమిటీ వేశామని.. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆదిమూలపు పేర్కొన్నారు.

# ఒడిశా ముఖ్యమంత్రితో సీఎం జగన్ భేటీ





విశాఖపట్నం: ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. ఒడిశా సచివాలయంలో ఇద్దరు ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. మూడు అంశాలపై ఒడిశా సీఎంతో సీఎం వైఎస్ జగన్ చర్చిస్తున్నారు. ఒడిశా అభ్యంతరాలతో అనేక దశాబ్దాలుగా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యలపై ఈ భేటీలో చర్చ జరుపుతున్నారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, సీఎస్ సమీర్ శర్మ, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్యామలరావు, రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఉషా రాణి భేటీలో పాల్గొన్నారు. వంశధార నదిపై నేరేడి బ్యారేజీ నిర్మాణం, జంఝావతి ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం వైఎస్ జగన్.. ఈ భేటీలో నవీన్ పట్నాయక్ చర్చించనున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య అరుదైన భేటీ కావడంతో ఈ సమావేశం ద్వారా ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉత్తరాంధ్ర రైతుల కల సాకారం అవుతుందని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒడిశా తెలుగు అసోసియేషన్ సభ్యులు కలిశారు. ముందుగా శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డిశాంతి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను సీఎం వైఎస్ జగన్ ఆశీర్వదించారు. భువనేశ్వర్ పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో పలువురు ప్రజా ప్రతినిధులు కలిశారు. మంత్రి అవంతి శ్రీనివాస్‌తో పాటు విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వివిధ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దులోని గ్రామాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ టీడీపీ: సజ్జల

అమరావతి: అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ టీడీపీ అని, వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2014-19లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ చేసిన దౌర్జన్యాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు



తమపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. "అనంతపురంలో రాళ్లు వేశారు. ఓ విద్యార్థికి దెబ్బలు తగిలాయి. మా ప్రభుత్వంలో ఎవరైనా సరే దాష్టీకం చేస్తే సహించేది లేదు. అక్కడ కొన్ని శక్తులు దూరినట్లు ఉన్నాయన్నారు. 2249 ఎయిడెడ్ సంస్థలు ఉంటే.. 702 సంస్థలు వాళ్లే నడుపుకుంటున్నారు. ఇక్కడ ఏమీ బలవంతం లేదనడానికి ఇదే నిదర్శనం. 101 సంస్థలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇచ్చారు. వారిలో మళ్లీ వెనక్కు అడుగుతున్నారు. టీచర్లు, యాజమాన్యం కలిసి వచ్చిన చోట మాత్రమే తీసుకున్నాం. అసలు ఇందులో విమర్శలు చేయడానికి అవకాశం ఎక్కడుంది. అసలు ఈ విధానం వల్ల నష్టం ఏమిటి..? ఆందోళన చేయడంలో రాజకీయ పార్టీలకు వచ్చే ప్రయోజనం ఏమిటి..? ఎయిడెడ్ విషయంలో ఎలాంటి బలవంతం చేయడం లేదు. టీచర్లు చాలా ఆనందంగా ఉన్నారు. అబద్ధపు విష ప్రచారాన్ని నమ్మొద్దు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 14 స్థానాలకు సామాజిక న్యాయంతో అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రకటనలో అవాస్తవం ఏముందో బీజేపీ నేతలు చెప్పాలని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రూ. 3.20 లక్షల కోట్లు కేంద్రం కోటా కింద వేసుకుంటున్నారు. దాన్ని కూడా రాష్ట్రాలకు వాటా ప్రకారం ఇవ్వాలన్నారు. అప్పుడు కేంద్రం ఎంత తగ్గిస్తే.. దాని ప్రకారం రాష్ట్రాల్లో తగ్గుతుందని సజ్జల పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల కోటా
# ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మంగళవారం 11 ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదలైంది. అనంతపురం-1, కృష్ణా-2, తూర్పుగోదావరి-1, గుంటూరు-2, విజయనగరం-1, విశాఖపట్నం-2, ప్రకాశం-1 స్థానాలకు షెడ్యూల్ ప్రకటించారు. నవంబర్ 16న నోటిఫికేషన్, డిసెంబర్ 10న పోలింగ్, 14న కౌంటింగ్ జరగనుంది. తెలంగాణలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ, మెదక్, నిజామాబాద్, ఖమ్మం నుంచి ఒక స్థానం.. కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి నుంచి రెండు



స్థానాలకు మంగళవారం షెడ్యూల్‌ను ప్రకటించారు. నవంబర్ 16న నోటిఫికేషన్, నవంబర్ 23న నామినేషన్ల స్వీకరణకు చివరితేదీ, నవంబర్ 24న నామినేషన్ల పరిశీలన, నవంబర్ 26న ఉపసంహరణకు చివరి తేదీ, డిసెంబర్ 10న పోలింగ్, డిసెంబర్ 14న కౌంటింగ్ జరగనుంది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం జగన్

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డిశాంతి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను



సీఎం వైఎస్ జగన్ ఆశీర్వదించారు. శ్రీకాకుళం, ఒడిశా రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సీఎం జగన్‌కు మంత్రులు అవంతి శ్రీనివాసరావు, బొత్స సత్యనారాయణ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, డాక్టర్ సత్యవతి, మేయర్ హరి వెంకటకుమారి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఘన స్వాగతం పలికారు.

# ఏపీ పీజీసెట్ ఫలితాలు విడుదల

విజయవాడ: ఏపీ పీజీసెట్ ఫలితాలను విద్యాశాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ రామ్మోహనరావు, యోగివేమన యూనివర్శిటీ వీసీ సూర్యకళావతి హాజరయ్యారు. తొలిసారి అన్ని యూనివర్శిటీలలో ప్రవేశానికి ఉన్నత విద్యామండలి ఒకే పీజీ సెట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో పీజీ ప్రవేశాలకి ఒకే సెట్ మొదటిసారిగా నిర్వహించాం. ఆన్‌లైన్ లో నిర్వహించిన ఈ పరీక్షా ఫలితాలని రెండు వారాలలో ప్రకటించాము. పీజీ ప్రవేశాలకి 39,856 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రవేశ పరీక్షకి 35,573 మంది హాజరుకాగా 24,164 మంది అర్హత సాధించారు. పీజీ సెట్‌లో 87.62 శాతం మంది అర్హత సాధించారు. గతంలో అన్ని యూనివర్సిటీలకి ఒకే ప్రవేశ పరీక్ష ఉండకపోవడం వల్ల విద్యార్థులకి అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ ప్రవేశ పరీక్ష వల్ల అర్హత సాధించిన విద్యార్థులు తమకు ఇష్టమైన కోర్సులలో నచ్చిన యూనివర్సిటీలో చేరవచ్చు. ఉన్నత విద్యలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారు. ప్రవేశపరీక్షలలో ఎటువంటి అవకతవకలకి ఆస్కారం లేకుండా కట్టుదిట్టంగా విజయవంతంగా నిర్వహించాం అని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.



# ఫైజర్, కొవిషీల్డ్ వ్యాక్సిన్లతో మెరుగైన యాంటీబాడీలు!

లండన్ : కొవిడ్-19 బారినపడిన వారిలో తయారయ్యే యాంటీబాడీలతో పోలిస్తే ఫైజర్, ఆస్ట్రాజెనెకా (కొవిషీల్డ్) వ్యాక్సిన్లతో ఎక్కువగా యాంటీబాడీలు తయారవుతాయని సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ




యాంటీబాడీలు డెల్టా వేరియంట్‌పైనా ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని కెనడాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ మోంట్రీల్ పరిశోధకులు బృందం తెలిపింది. వ్యాక్సిన్ తీసుకోని వైరస్ సోకిన వ్యక్తితో పోలిస్తే ఫైజర్, కొవిషీల్డ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో యాంటీ బాడీల స్థాయి రెట్టింపుగా ఉందని పరిశోధకులు గుర్తించారు. వీరిలో తయారైన యాంటీబాడీలు స్పైక్-ఏసీఈ-2 ఇంటరాక్షన్‌ను కూడా మెరుగ్గా నిరోధిస్తున్నట్లు కనుగొన్నారు. గతంలో వైరస్ సోకిన వారికి డెల్టా వేరియంట్ నుంచి కూడా వ్యాక్సినేషన్ మెరుగైన రక్షణ కల్పిస్తుందని ఈ పరిశోధనలో వెల్లడైందని యూనివర్సిటీ ఆఫ్ మోంట్రీల్ ప్రొఫెసర్ జీన్ ఫ్రాంకోయిస్ మాసన్ తెలిపారు. వైరస్ అన్ని వేరియంట్లను దీటుగా ఎదుర్కొనే యాంటీబాడీలను సమర్థంగా ఎలా నిర్వహించాలనే దానిపై మరింత పరిశోధన సాగాలని పరిశోధకులు పేర్కొన్నారు.

# బూతుల మంత్రులకు అవార్డులు ఇవ్వాలి

## - రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు

అమరావతి ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించమని అడుగుతుంటే అర్థం లేని మాటలు మాట్లాడుతూన్నారు. బూతులు తిట్టే మంత్రులకు పద్మశ్రీ తరహాలోనే ఏపీలో అవార్డులు ఇవ్వాలి. ఎర్రి పుష్పాల అవార్డులు మంత్రులకు ఇవ్వాలి. అన్ని రాష్ట్రాలకు సహాయం చేయడం కోసమే కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించింది. బీజేపీ పెట్రోల్, డీజిల్ ఆదయంగా మార్చుకుంటే సోలార్, ఎలక్ట్రానిక్ వాహనాలు ఎందుకు తయారు చేస్తాం. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలని అమలు చేయలేదు. బద్వేల్ ఉప ఎన్నికల్లో మిమ్మల్ని దేకించాం. డిపివోలను అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో గెలిచారు. బద్వేల్ ఉపఎన్నికపై చర్చకు సిద్ధమా అని అడిగారు. బీజేపీ తోక పార్టీ అయితే వైసీపీ ఏంటి? 18రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని మంత్రులు తెలుసు కోవాలి. ఏపీ మంత్రులు భారతదేశంలో ఉన్నారా పాకిస్తాన్ లో ఉన్నారా? ధరలు తగ్గించమని ప్రశ్నిస్తే అసత్యాలతో ప్రకటన ఇస్తారా. సమాధానం చెప్పాలని బీజేపీ ప్రశ్నిస్తే దివాలకోరు వ్యాఖ్యలు చేస్తారా. ఎయిడెడ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. న్యాయం చెయ్యమని అడిగితే పోలీసులతో కొట్టిస్తారా. కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే అది మీపైనే పడుతుంది. పెట్రోల్ ,డీజిల్ ధరలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనపై సీఎం, సీఎస్ కు లేఖ రాస్తా. డీజిల్,పెట్రోల్ కు పక్క రాష్ట్రానికి ఏపీకి 12రూపాయల తేడా ఉందని అన్నారు. చిప్ లిక్కర్ ను కూడా అధిక ధరకు ప్రభుత్వం అమ్మకాలు చేస్తుంది. జగన్ అన్న కానుకలు అన్ని ప్రజలపై వేసిన భారాల నుంచి ఇస్తున్నవేనని అన్నారు. మంత్రులు



అంతా పచ్చ పుష్పాలు, వెర్రి పుష్పాలు. రాజధాని ఇక్కడే ఉండాలని బీజేపీ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుంది. రాజధానికి బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఏమయ్యాయి. రాజధాని పేరు చెప్పి పన్నులు వసూలు చేస్తున్నారు. బీజేపీ ప్రతిపక్ష పార్టీగా తన పాత్ర ఏపీలో పోషిస్తుంది. రాజధాని రైతులను ఎందుకు నిరోధించాలి. ప్రజాస్వామ్యంలో ఎవ్వరు ఉద్యమాలు చేసినా అడ్డుకోకూడదు. రైతులపై ప్రభుత్వం ఆంక్షల బీజేపీ ఖండిస్తుంది. బీజేపీ రూలింగ్ చేస్తుంది తప్ప బూమ్ బూమ్ బీర్లు తయారు చేయడం లేదని అయన అన్నారు.

# 'బీజేపీ నేతలు పేదల రక్తం పీలుస్తున్నారు'

## ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని ధ్వజం

అమరావతి: దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ చిత్తుచిత్తుగా ఓడిపోయిందని ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని ఎద్దేవా చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం పెట్రోల్‌పై రూ. 40 పెంచి ఐదు రూపాయలు తగ్గించిందని, ఏదో ఘన కార్యం చేసినట్లు బీజేపీ నేతలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికలో ఘోర ఓటమి చవిచూసినా బీజేపీ తీరుమారలేదన్నారు. క్రూడాయిల్ రేట్లు తగ్గినా.. పెట్రోల్ ధరను మోదీ పెంచారని అన్నారు. 70 రూపాయలు ఉన్న పెట్రోల్ ధరను రూ. 110కి పెంచారని ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు పేదల రక్తం పీలుస్తున్నారని, రూ. 5 తగ్గించి ప్రజలకు ఏదో వేలు చేశామంటున్నారని దుయ్యబట్టారు. తిరుపతి, బద్వేలు ఉపఎన్నికల్లో డిపాజిట్టు రాని బీజేపీ పెద్ద పెద్ద మాటలు చెబుతోందని ఎద్దేవా చేశారు. కులాలు, మతాలు మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు వయసు వచ్చింది కానీ బుద్ధి రాలేదని మండిపడ్డారు. చంద్రబాబు జీవితమంతా మోసాలు, కుట్రలు, వెన్నుపోట్లు అని అన్నారు. పెట్రోల్ బంకులపై దాడులు చేసేందుకు చంద్ర బాబు నిరసన దీక్ష చేపట్టారని అన్నారు.

# సంపాదకీయం

బుధవారం 10 నవంబరు 2021

## తూర్పు లడక్ లో డ్రాగన్ వక్రబుద్ధి

తూర్పు లద్దాఖ్ కయ్యానికి కాలు దువ్వుతున్న చైనాకు భారత్ ఎప్పటికప్పుడు చెక్ పెడుతోంది. లద్దాఖ్‌లో మళ్లీ అలజడి సృష్టిస్తోంది డ్రాగన్.. చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి అన్ని ఏర్పాటు చేసినట్టు భారత ఆర్మీ. తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసి)పై భారత్– చైనాలు తమ పట్టును బిగించాయి. చైనా కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తున్నారు నిపుణులు. సైనిక కార్యకలాపాలను పెంచడం. మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే రెండు వైపుల నుండి నిరంతర పర్యవేక్షణపై నాలుగు వారాల చర్చలు జరిగినప్పటికీ పరిస్థితి మరింత దారుణంగా ఉందని చెప్పారు. హిందూస్థాన్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఇరువైపులా క్లిష్ట పరిస్థితుల కారణంగా సైనిక చర్చలు ప్రస్తుతం విజయవంతం అయ్యే అవకాశం లేదని..ఈ సందర్భంలో పై నుండి జోక్యం చేసుకోవడం మాత్రమే 18 నెలల సరిహద్దు సంక్షోభాన్ని పరిష్కరించగలదని ఒక అధికారి అభిప్రాయపడ్డారు. అదే సమయంలో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ చర్యకు ప్రతిస్పందనగా సెక్టార్‌లో ఇండియన్ ఆర్మీ కార్యకలాపాలు ఉన్నాయని.. ఎలాంటి విపత్తు కార్యకలాపాలను ఎదుర్కోవటానికి తాము సిద్ధంగా తీసుకున్నట్లుగా మరో అధికారి వెల్లడించారు.డ్రాగన్ పదేపదే తన వక్రబుద్ధి ప్రదర్శిస్తూనే ఉంది. సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామంటూ నీతులు వల్లిస్తూనే.. ఎల్‌ఏసీ దగ్గర భారీగా శాశ్వత నిర్మాణాలు చేపడుతోంది. వివాదాస్పద ప్రాంతాలకు అత్యంత త్వరగా బలగాలను చేర్చేందుకు వీలుగా సరిహద్దుల్లో కాంక్రీట్ శిబిరాలను నిర్మిస్తోంది.సంవత్సరం ఒంఅపై ఘర్షణ పాయింట్లపై రెండు రౌండ్ల చర్చల తర్వాత కూడా ఇరు దేశాల సైన్యాలను మోహరించాయి. ఇప్పటికే అధునాతన ఆయుధాలను కలిగి ఉన్న 50 నుండి 60 వేల మంది సైనికులను సరిహద్దు ప్రాంతాల్లో దింపారు. గత వారం విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ బీజింగ్ సంక్షోభాన్ని పరిష్కరించడానికి చర్చలలో పాల్గొన్నప్పటికీ "ఎల్‌ఏసీపై తన వాదనలను బలోపేతం చేయడానికి అదనపు.. వ్యూహాత్మక చర్య" తీసుకుంటోందని పేర్కొంది. ఉత్తర ఆర్మీ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ హుడా (రిటైర్డ్) మాట్లాడుతూ ఇరువైపులా పరిస్థితి మరింత దిగజారిందని.. 13వ రౌండ్ సైనిక స్థాయి చర్చల తర్వాత భారతదేశం– చైనాలు చేసిన ప్రకటనలు సారూప్యతను కనుగొనడంలో స్పష్టమైన సూచన అని అన్నారు. ప్రతిష్టంభనను పరిష్కరించడానికి రాజకీయ, దౌత్య స్థాయిలో ప్రయత్నాలు అవసరం. అయితే, ఈ దశలో ఏ దేశమైనా చొరవ తీసుకోవడానికి సుముఖంగా ఉందో లేదో అనిశ్చితంగా ఉంది. అక్టోబర్ 10న జరిగిన 13వ రౌండ్ చర్చల్లో భారత సైన్యం ఇచ్చిన సూచనలతో పీఎల్యే ఏకీభవించలేదు. మిగిలిన ప్రాంతాలను పరిష్కరించేందుకు తాము నిర్మాణాత్మక సూచనలు చేశామని.. అయితే చైనా అంగీకరించలేదని.. దార్శనికతతో కూడిన ప్రతిపాదనతో ముందుకు రాలేదని భారత సైన్యం పేర్కొంది. మరోవైపు భారత్ అవాస్తవ, అసమంజసమైన డిమాండ్లను చేస్తోందని వక్ర బుద్ధి కలిగిన చైనా ఆరోపించింది. అక్టోబర్ 10 చర్చల తరువాత, పీఎల్యే ఎల్‌ఏసీ అంతటా ట్యాంక్ డ్రిల్ నిర్వహించింది. భారత సైన్యం తన వేగవంతమైన ప్రతిస్పందన సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి గత వారం తూర్పు లడఖ్‌లో వైమానిక విన్యాసాన్ని ప్రారంభించింది. "ఇరువైపులా కఠినమైన వైఖరి ఉంది. అయితే చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి" అని చైనా నుండి నిపుణుడు, జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌ఎల్ నరసింహన్ (రిటైర్డ్) అన్నారు. సైనిక చర్చలు ఇంకా కొనసాగుతున్నాయన్నది వాస్తవం అని నరసింహ తెలిపారు. ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నర్వానే అక్టోబర్ 9న లడఖ్ థియేటర్‌లో ఉండాలనుకుంటే భారత సైన్యం కూడా అక్కడే ఉందని చెప్పారు. లడఖ్ సెక్టార్‌లో, హాట్ స్ప్రింగ్స్ , డెప్సాంగ్ వద్ద ప్రతిష్టంభనను పరిష్కరించాల్సి ఉంది. హాట్ స్ప్రింగ్స్ (పెట్రోలింగ్ పాయింట్ –15) వద్ద భారత సైన్యం యొక్క పెట్రోలింగ్ కార్యకలాపాలు . మరో వైపు ర్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చైనా సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై చర్చ జరగాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసి. వివాదాస్పద సరిహద్దులన్నింటికీ అఖిలపక్షంగా ఎంపీలను తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఇది భారత సార్వభౌమత్వాన్ని మరింత పెంచుతుందని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు.ఇండియా, చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. గతంలో గాల్వన్ లోయలో ఇరు దేశాల మధ్య ఘర్షణను మరిచిపోకముందే ఇటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం ప్రాంతాల సరిహద్దుల్లో కవ్వింపు ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో ఏకంగా ఒక గ్రామాన్నే నిర్మించింది. మరోవైపు సిక్కిం సరిహద్దుల్లో చుంబీలోయలో సరిహద్దు అతిక్రమణకు పాల్పడుతోంది. దీంతో అక్కడ నుంచి భారత్ పై నిఘా పెడుతుంది. దీంతో ఆప్రాంతానికి సమీపంలో ఉండే సిలిగురి కారిడార్ చికెన్ నెక్ పై చైనా ద్రుష్టి పెడుతుందా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అసదుద్దీన్ ఓవైసీ శీతాకాలం సమావేశాల్లో సరిహద్దు భద్రత పై చర్చించాలని అన్నారని తెలుస్తోంది

## ఆమీ, తుమీకి రెడీ అవుతున్న జగన్



విజయవాడ, నవంబర్ 9, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ రాజకీయంగా కేంద్ర ప్రభుత్వంతో అమితుమీ తేల్చుకునేందుకే సిద్ధమయినట్లు కన్పిస్తుంది. ఇద్దరి మధ్య సయోధ్యకు పెట్రోలు మంట రాజేసినట్లే కనపడుతుంది. బీజేపీ రాష్ట్ర పార్టీతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇరుకున పడేలా పెట్రోలు రేట్లు పెరిగిన తీరు, దొడ్డిదారిన కేంద్ర ప్రభుత్వం సెస్సు వేయడం, ఎంత పెంచిందీ? ఎంత తగ్గించిందీ? తదితర విషయాలను ప్రజలకు చెప్పడం ద్వారా బీజేపీతో కయ్యానికి సిద్ధమయినట్లే కన్పిస్తుంది.నిజమే పెట్రోలు ధరలు లీటరకు 40 రూపాయలకు పెంచి ఐదు రూపయాలకు తగ్గించి బిల్డప్ లు ఇవ్వడం బీజపీకి మామూలే. పైగా అసలే కరోనాతో అతలాకుతలమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రాష్ట్రాలకు ఈ పెట్రో భారం మరింత ఇబ్బంది తెచ్చి?పెట్టనుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసమే పెట్రోలు ధరలు తగ్గించారన్నది వాస్తవం. ఆ ఎన్నికల అనంతరం మళ్లీ పెరుగుతాయన్నది కూడా కాదనలేదని నిజం. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర శాఖ జగన్ పై ఎదురుదాడికి దిగడంతో జగన్ వాస్తవ విషయాలను ప్రకటన రూపంలో చెప్పాల్సి వచ్చింది.ఇక ప్రతిపక్ష నేత చంద్రబాబు సయితం గతంలో పెట్రోలు ఎప్పుడు పెరిగినా బీజేపీని ఒక్క మాట అనలేదు. కేంద్ర ప్రభుత్వం నలభై రూపాయలను పెంచినా ఏమీ అనని చంద్రబాబు ఏపీలో జగన్ ప్రభుత్వం రూపాయి పెంచిన వెంటనే అల్లరి చేయడానికి రెడీ అయిపోయారు. రోజూ పెట్రోలు ధరలు పెరుగుతున్నా ఏమీ బీజేపీని అనలేదు. కానీ ఇప్పుడు ఇతర రాష్ట్రాల మాదిరిగా ఏపీలోనూ పెట్రోలుపై వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే జగన్ తాను పెట్రోలు ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించేది లేదని చెప్పకనే చెప్పినట్లయింది. నలభై రూపాయల వరకూ పెంచిన బీజేపీని ఏమీ అనకుండా రూపాయి పెంచిన తమపై విమర్శలు చేయడమేంటని వైసీపీ నేతలు సయితం అంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రాలను ఇరుకున పెట్టేందుకు ఈ విధమైన డ్రామా ఆడుతుందని గ్రహించిన జగన్ తాను చెప్పదలచుకున్నది సూటిగా ప్రకటన రూపంలో చెప్పినట్లయింది. జగన్ కు, బీజేపీకి మధ్య ఇప్పటి వరకూ ఉన్న మైత్రిపై పెట్రోలు మంట పెట్టిందనే చెప్పాలి.

## కళా వెంకట్రావు కు ఈ సారి చెక్

శ్రీకాకుళం, నవంబర్ 9, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ ఈసారి టిక్కెట్ల కేటాయింపులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. సామాజిక సమీకరణాలే కాకుండా గెలుపు లక్ష్యంగానే టిక్కెట్ల కేటాయింపు ఉండనుంది. ఈ నేపథ్యంలో ఈసారి చంద్రబాబు కొందరు సీనియర్ నేతలకు చెక్ పెట్టనున్నారు. సీనియర్ నేతలకు గాని వారి వారసులకుగాని వచ్చే ఎన్నికలకు దూరంగా ఉంచాలని నిర్ణయించారు. ఇప్పుడు పార్టీలో ఇదే హాట్ టాపిక్ గా మారింది. టిక్కెట్లు దక్కనీ సీనియర్లలో కళా వెంకట్రావు ముందు వరసలో ఉంటారంటున్నారు.ఎచ్చెర్ల నియుజకవర్గంలో కళా వెంకట్రావు రాజకీయుంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన సీనియర్ నేతగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయనకు సొంత పార్టీలోనే వ్యతిరేకత తీవ్రంగా ఉంది. నాన్ లోకల్ ముద్రను ఆయన కుటుంబం మూటకట్టుకుంది. టీడీపీలోని అనేక మంది నేతలు ఆయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తుండమే కాకుండా మళ్లీ టిక్కెట్ ఇస్తే తాము సహకరించబోమని హెచ్చరిస్తున్నారు.కళా వెంకట్రావు ఎచ్చర్ల నియోజకవర్గానికి నాన్ లోకల్. అయినా కళా వెంకట్రావు ఎచ్చర్ల నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. తన కుమారుడిని ఈసారి పోటీలోకి దింపాలని ప్రయత్నిస్తున్నారు. కానీ స్థానిక నాయకులు దీనికి అంగీకరించడం లేదు. అక్కడ బలంగా ఉన్న మరో టీడీపీ నేత కలిశెట్టి అప్పలనాయుడు కళాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనను పార్టీ నుంచి రెండుసార్లు సస్పెండ్ చేసినా పార్టీలోనే మరో వర్గంగా మసలుతున్నారు.దీంతో చంద్రబాబు

ఈసారి ఎచ్చర్లకు కొత్తనేతను ఎంపిక చేసే అవకాశాలున్నాయి. అధికారంలోకి వస్తే కళా వెంకట్రావుకు ఎమ్మెల్సీయో, రాజ్యసభ పదవో ఇస్తామని హామీ ఇచ్చి ఆయన కుటుంబాన్ని పోటీకి దూరం చేయనున్నారు. ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడం, ప్రతి సీటూ కీలకం కావడంతో చంద్రబాబు సీనియర్ నేతలయినా ఎన్నికలకు దూరంగా ఉంచి, వారి సేవలను పార్టీకి ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. మొత్తం మీద కళా వెంకట్రావు కుటుంబానికి ఈసారి టీడీపీ అధినేత చంద్రబాబు ఝలక్ ఇచ్చే అవకాశాలున్నాయి.

## ఆపరేషన్ పరివర్తన్.. మార్పు తెచ్చేనా

విశాఖపట్టణం, నవంబర్ 9, (న్యూస్ పల్స్)ఆంధ్ర?ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో గంజాయి సాగును నిర్మూలించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) 'ఆపరేషన్ పరివర్తన్'ను ముమ్మరం చేసింది. దీన్లో భాగంగా గిరిజనుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అయిదు రోజుల్లో విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించింది. గంజాయి సాగుతో కలిగే దుష్పరిణామాలపై పోలీసులు, నిపుణులు గిరిజనులకు అవగాహన కల్పించారు. మరోవైపు ఎస్‌ఈబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన మార్గాల్లో తనిఖీలు చేస్తూ నిఘాను పటిష్టపరిచారు. మొత్తం 283 కేసులు నమోదు చేసి 763 మందిని అరెస్టు చేశారు. 9,266 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 179 వాహనాలను జప్తుచేశారు.విశాఖ ఏజెన్సీలో గంజాయి తోటల ధ్వంసం లక్ష్యంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు చెందిన ఎక్సైజ్‌శాఖ అధికారులు, ఇతర సిబ్బంది ఏడు బృందాలుగా పాడేరులో మకాం వేశాయి. జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో ఆదివారం 260 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశారు. అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో జి.మాడుగుల మండలంలోని బొయితిలి ప్రాంతంలో 40 ఎకరాలు, గుప్పవీధిలో 40 ఎకరాలు, ఎగువ వాకపల్లిలో 55 ఎకరాలు, దిగువ వాకపల్లిలో 55 ఎకరాల్లో సుమారు 2 లక్షల గంజాయి మొక్కల్ని వేర్లతోసహా పీకేసి నిప్పంటించారు. గూడెంకొత్తవీధి మండలంలోని రింతాడ, దామనాపల్లి పంచాయతీల పరిధిలో సిగినాపల్లి, నల్లబెల్లి, తుప్పలదొడ్డి, గుర్రాలవీధి, అసరాడ, కాకరపాడు గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో, చింతపల్లి మండలంలోని టేకులవీధి, గడపరాయిలో 20 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశారు. డీవీజీ రాజు తదితరులు పాల్గొన్నారు.ఏజెన్సీలోని గంజాయి సాగు, అక్రమ రవాణా నిర్మూలనలో గిరిజన యువత భాగస్వాములవ్వాలని పాడేరు ఏఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు.

'నో టు గంజా', పరివర్తన కార్యక్రమంలో భాగంగా ఆదివారం విశాఖజిల్లా పాడేరులో గిరిజన విద్యార్థులతో 2కే రన్ నిర్వహించారు. చలిగాలులు ఉన్నప్పటికీ 500 మంది గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు. గంజాయికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు ఏఎస్పీ జగదీష్ మాట్లాడుతూ గంజాయి సాగు ద్వారా విశాఖ ఏజెన్సీకి చెడ్డపేరు వస్తోందన్నారు. గిరిజనులంతా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. స్మగ్లర్లు గంజాయి రవాణాకు యువతను ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. గిరి జన యువత జైలు జీవితం గడుపుతూ భవి ష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

## టీడీపీ పునర్జీవ పనుల్లో బాబు



హైదరాబాద్, నవంబర్ 9, (న్యూస్ పల్స్)తెలంగాణలో టీడీపీ దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. నేతలు అందరూ పార్టీని వీడివెళ్లిపోయారు. అయితే ఇక్కడ చంద్రబాబు పార్టీని మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నారు. ఇక్కడ బలంగా ఉంటేనే ఏపీలో రాజకీయాలు టీడీపీకి అనుకూలంగా మారతాయని అంచనా వేస్తున్నారు. అందుకే తమకు పట్టున్న ప్రాంతాల్లో పార్టీ నేతలు వీడిపోకుండా, అక్కడ కనీస స్థానాలను సాధించే లక్ష్యంతో పనిచేయాలని తెలంగాణ టీడీపీ నేతలకు సూచించారు.రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా నియమితులు కావడంతో చంద్రబాబు కాంగ్రెస్ కూటమితో మరోసారి జట్టుకడతారని అందరూ భావించారు. కానీ రేవంత్ రెడ్డి కంటే ఏపీలో తన పార్టీ ముఖ్యమని భావించిన చంద్రబాబు బీజేపీతోనే జట్టుకట్టేందుకు సిద్ధమయ్యారు. ముందుగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. ఇక్కడ బీజేపీ, జనసేనతో జట్టు కడితే అదే కాంబినేషన్ ఏపీలోనూ రిపీట్ అవుతుంది.తెలంగాణ బీజేపీ నేతలు కూడా చంద్రబాబుతో పొత్తుకు సిద్ధంగానే ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి నేతలు వెళ్లిపోయినా క్యాడర్, ఓటు బ్యాంకు బాగానే ఉందని భావిస్తున్నారు. తాము బలహీనంగా ఉన్న ఖమ్మం, నల్లగొండ వంటి జిల్లాల్లో టీడీపీతో పొత్తు తమకు బలం చేకూరుస్తుందని బీజేపీ నేతలు విశ్వసిస్తున్నారు. జనసేనను కూడా కలుపుకుని పోతే హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లో కూడా కొంత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని భావించి, తెలంగాణ బీజేపీ నేతలు చంద్రబాబుతో పొత్తు పట్ల సానుకూలంగా ఉన్నారు.దీంతో రేవంత్ రెడ్డి తమ పార్టీ నేతలను కాంగ్రెస్ లోకి తీసుకెళ్లకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారని తెలిసింది. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన టీడీపీ నేతలకు ఫోన్ చేసి భవిష్యత్ ఉంటుందని, పార్టీలోనే కొనసాగాలని చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికల సమయానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చి కొంత హైప్ క్రియేట్ చేయాలని కూడా చంద్రబాబు భావిస్తున్నారు. మొత్తం మీద రేవంత్ రెడ్డి ఆలోచనలకు వ్యతిరేకంగా చంద్రబాబు అడుగులు పడుతున్నాయన్నది వాస్తవం. ఇక్కడ పొత్తు కుదిరితే ఏపీలో సులువుగా అదే పొత్తుతో విజయం సాధించవచ్చన్నది చంద్రబాబు వ్యూహంగా తెలుస్తోంది.

## తప్పిదాలు చేస్తున్న రిటర్నింగ్ అధికారులు

విశాఖపట్నం నవంబర్ 9, (న్యూస్ పల్స్)విశాఖ కార్పోరేషన్ ఎన్ని కల లో రిటర్నింగ్ అధికారులు తీవ్ర తప్పిదాలు చేస్తున్నారని, దీనిపై తక్షణమే ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని విశాఖ టీడీపీ పార్లమెంటు విభాగం అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తెలిపారు. 31వ వార్డు లో టీడీపీ తరుపున గెలిచిన అభ్యర్థి వానపల్లి రవికుమార్ మరణించడంతో బై ఎలక్షన్ లు నిర్వహిస్తున్నారు. అయితే ఈ వార్డు లో బిపిన్ కుమార్ జైన్ అనే వ్యక్తి నామినేషన్ వేసిన సమయం లో కాంగ్రెస్ కండువాతోను, ఎన్నికల నామినేషన్ గడువు ముగిసే సమయానికి స్వతంత్ర అభ్యర్థి గా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. బీరువా గుర్తు కూడా కేటాయించారు. అయితే అత్యంత నాటకీయ పరిణామాల అనంతరం అధికారులు అధికార వైసీపీ పార్టీ కి కొమ్ము కాశారని ఆరోపిస్తున్నారు. ఈ స్వతంత్ర అభ్యర్థి ని రాత్రి సమయానికి వైసీపీ అభ్యర్థి గా ప్రకటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో అధికారులు రాజ్యాంగ బద్ధంగా నడుచు కోవాలని సూచించారు.

## ఏపీకి తొలి ఎలక్ట్రిక్ బస్సులు

తిరుపతి, నవంబర్ 9, (న్యూస్ పల్స్)దేశంలో తొలిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేసిన, ఎలక్ట్రిక్ మొబిలిటీ అగ్రగామి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒలెక్ట్రా), ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల కన్సార్షియం ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ నుంచి ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్‌ను పొందింది. ఆ ఆర్డర్ ప్రకారం 100 ఎలక్ట్రిక్ బస్సులను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) అపెక్స్ మోడల్ ప్రాతిపదికన అందించాల్సి ఉంటుంది. ఈ కాంట్రాక్టు 12 సంవత్సరాలు అమలులో ఉంటుందని దేశంలో అగ్రగామి ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్ సంస్థ.. ఎంఈఐఎల్ గ్రూపు, ఈవీ ట్రాన్స్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. పూర్తి కాలుష్య రహిత, శబ్ద రహిత, సౌకర్యవంతమైన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణాలు చేయాలన్న చిరకాల కల దీంతో నెరవేరబోతోంది. కేంద్ర ప్రభుత్వం, ఫేమ్ 1, ఫేమ్ 2 పథకాలతో దేశీయ ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ నుంచి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు 100 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ లభించింది. ఈ కాంట్రాక్ట్ మొత్తం విలువ దాదాపు రూ. 140 కోట్లు. వచ్చే 12 నెలల కాలంలో ఈ బస్సులను డెలివరీ చేయాల్సి ఉంటుందని ఏపీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. బస్సులు ఆర్టీసీకి అందిన వెంటనే తొలుత ఈ బస్సులను తిరుపతిలోని అలిపిరి డిపో నుంచి నిర్వహిస్తారు. ఇందులో 50 బస్సులను తిరుమల ? తిరుపతి ఘాట్ రోడ్డులోనూ, మరో 50 బస్సులను తిరుపతి నుంచి నెల్లూరు, కడప, మదనపల్లి పట్టణాలకు ఇంటర్‌సిటీ సర్వీసులుగా నడపనున్నారు. కాంట్రాక్టు కాలంలో బస్సులను మెయింటెనెన్స్‌ను ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ చేయనుంది. ఈ కొత్త ఆర్డర్‌తో ఒలెక్ట్రా ఆర్డర్ బుక్ దాదాపుగా 1,450 బస్సులకు చేరుకుంది.ఈ సందర్భంగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవి ప్రదీప్ మాట్లాడుతూ, శ్రీ వేంకశ్వర స్వామి దర్శనం కోసం తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డులో ప్రయాణించే భక్తులకు సేవలందించే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను ఆపరేట్ చేసే అవకాశం కలిగినందుకు గర్వంగా ఉందన్నారు. శేషాచల అడవులు, తిరుమల ఘాట్ రోడ్డుల సంపన్న పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నంలో ఎలక్ట్రిక్ బస్సులు తోడ్పడతాయన్నారు. ఎఫీషియెంట్ ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ ద్వారా కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలకు ఒలెక్ట్రా కట్టుబడి ఉంది. మిగతా రాష్ట్రాల్లో మాదిరిగానే మా ఈ వంద బస్సులు ఆంధ్రప్రదేశ్‌లో కూడా విజయవంతం అవుతాయన్న నమ్మకం ఉందని ప్రదీప్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులు మన్నికను, పనితీరును ఇప్పటికే నిరూపించుకున్నాయి. ముంబై, పూ?ణే, నాగ్‌పూర్, హైదరాబాద్, సూరత్, డెహ్రాడూన్, సిల్వాస, గోవా, హిమాచల్‌ప్రదేశ్, కేరళలో విజయవంతంగా మా బస్సులు నడుస్తున్నాయి" అని ఆయన తెలిపారు.

## చింతమనేని వర్సెస్ అబ్బయ్య

ఏలూరు, నవంబర్ 9, (న్యూస్ పల్స్)ఏ స్థాయి ఎన్నికలు జరుగుతున్నా ముందుగా చర్చల్లో నిలిచేది దెందులూరు నియోజకవర్గం. అందుకు కారణం చింతమనేని ప్రభాకర్. కాంట్రవర్సీ కింగ్. ఏ చిన్న పంచాయతీ ఎన్నిక జరిగినా అక్కడ రచ్చ అవ్వాల్సిందే. అందుకే దెందులూరు నియోజకవర్గం ఎప్పుడూ వార్తల్లో నానుతూ ఉంటుంది. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. చింతమనేని ప్రభాకర్ ఓడిపోయిన తర్వాత ఆయన తన తీరు మార్చుకున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని ఈసారి ఎలాగైనా ఓడించాలన్న పట్టుదలతో ఉన్నారుచూశారా.. ఒక్కసారి సీన్ ఎంత రివర్స్ అయిందో.. మొన్నటి వరకూ చింతమనేని ప్రభాకర్ ను ఓడించాలని ప్రత్యర్థులు చూసేవారు. కొన్ని ఎన్నికల పాటు ఆయనకు సరైన ప్రత్యర్థి దొరకలేదు. కానీ 2019 ఎన్నికల్లో అబ్బయ్య చౌదరి రూపంలో వచ్చి చింతమనేని హవాకు చెక్ పెట్టగలిగింది. ఇప్పుడు చింతమనేని ప్రభాకర్ సాధారణ నేతగా మారిపోయారు. ఆయన నిత్యం జనంలోనే ఉంటున్నారు. మిగిలిన టీడీపీ నేతలకు భిన్నంగా ఆయన వ్యవహరిస్తున్నారు.ఆయన ధ్యాసంతా ఒకటే. ఇటు పార్టీ బలోపేతం కావాలి. తాను గెలవాలి. అయితే అబ్బయ్య చౌదరి సయితం దెందులూరు నియోజకవర్గంలో మంచి పట్టు సంపాదించారు. ఇద్దరూ కమ్మ సామాజికవర్గం నేతలే కావడంతో అబ్బయ్య చౌదరిని అభిమానించి ఆయన వెంట ఉండేవాళ్లు ఎక్కువగా కన్పిస్తున్నారు. ఇతర సామాజికవర్గాల వారు తనను వీడిపోకుండా అబ్బయ్య చౌదరి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అబ్బయ్య చౌదరి ఎన్‌ఆర్ఐ కావడంతో వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. చింతమనేని కంటే బెటర్ అనిపించుకుంటున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో దెందులూరులో బిగ్ ఫైట్ ఉండబోతుందంటున్నారు. చింతమనేని గ్రాఫ్ కూడా క్రమంగా పెరుగుతుండటంతో ఆయనఈసారి గెలుపు అవకాశాలను వదులుకోరు. అబ్యయ్య చౌదరి అంతే. మొత్తం మీద దెందులూరులో ఈసారి పోరు సంక్రాంతి కోళ్ల పందేనికి మించి ఉంటుందన్నది విశ్లేషకుల అంచనా.

## గట్టు శ్రీకాంత్ ఈ సారి కష్టమేనా

కడపఆ నవంబర్ 9, (న్యూస్ పల్స్)cతొలి నుంచి జగన్ ను నమ్ముకున్న వారికి ఈసారి మంత్రి పదవి దక్కనుందా? సామాజిక సమీకరణాలు వారి పదవులకు అడ్డుపడతాయా? అన్న చర్చ పార్టీలో జరుగుతుంది. పార్టీలో సీనియర్ నేత, జగన్ కు నమ్మకమైన మిత్రుడుగా ఉన్న గడికోట శ్రీకాంత్ రెడ్డి కి ఈసారి మంత్రి పదవి దక్కడంపై సందేహం నెలకొంది. రెడ్డి సామాజికవర్గం కావడంతోనే ఆయనకు పదవి లభించే ఛాన్స్ లేదంటున్నారు. ఆయునతో జగన్ ప్రత్యేకంగా భేటీ అయి పరిస్థితిని వివరించే అవకాశముందటున్నారు.కడప జిల్లాలో గడికోట శ్రీకాంత్ రెడ్డి తొలి నుంచి వైసీపీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి జగన్ పార్టీ పెట్టిన తర్వాత రాజీనామా చేసి జగన్ కు అండగా నిలిచారు. రాయచోటి నుంచి ఇప్పటికే నాలుగు సార్లు గడికోట శ్రీకాంత్ రెడ్డి విజయం సాధించి జిల్లాలో సీనియర్ గా నిలిచారు. మంత్రి పదవి కోసం ఆయన తొలి సారి ఆశించినా దక్కలేదు. ఈసారి ఖచ్చితంగా తనకు మంత్రి పదవి లభిస్తుందని గడికోట శ్రీకాంత్ రెడ్డి భావిస్తున్నారు.జగన్ తన సొంత జిల్లా కావడంతో ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రిగా తాను ఉన్నారు. ఇక మరొకరికి మాత్రమే జిల్లా నుంచి కేబినెట్ లో చోటు లభించే అవకాశముంది. తొలిసారి అంజాద్ భాషాకు మైనారిటీ కోటాలో మంత్రిపదవి ఇచ్చారు. ఈసారి అంజాద్ భాషాను తప్పించడం ఖాయం. ఆయన స్థానంలో మరొకరికి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మరో రెడ్డికి ఇచ్చే అవకాశం లేదు. రెడ్డి సామాజికవర్గంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డిలు పోటీ పడుతున్నారు.కానీ వీరెవ్వరికీ ఈసారి కేబినెట్ లో చోటు దక్కే అవకాశం లేదు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు కూడా తొలి నుంచి జగన్ ను నమ్ముకుని ఉన్నారు. ఎస్సీ కోటాలో ఆయనకు పదవి దక్కవచ్చన్న ప్రచారం జరుగుతోంది. గడికోట శ్రీకాంత్ రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోకపోయినా జగన్ చీఫ్ విప్ పదవిని ఇచ్చారు. దానితోనే సరిపెడతారని పార్టీ నేతలు భావిస్తున్నారు. మొత్తం మీద గడికోట శ్రీకాంత్ రెడ్డికి ఈసారి కూడా మంత్రి పదవి ఆశలు నెరవేరేటట్లు లేదు.

# కేసీఆర్ రివర్స్ గేమ్

విజయవాడ, నవంబర్ 9, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో ఎప్పుడు ఎలాంటి వ్యూహం అమలు చేయాలో కేసీఆర్‌కు బాగా తెలుసు?పరిస్తితులకు తగ్గట్టుగా రాజకీయాన్ని మార్చేస్తారు. అలా రాజకీయం మార్చేసి సక్సెస్ అవుతారు. కానీ ఈ మధ్య ఏంటో కేసీఆర్ రాజకీయాలు పెద్దగా వర్కౌట్ కావడం లేదు. హుజూరాబాద్ ఉపఎన్నికలో ఈటల రాజేందర్‌ని ఓడించడానికి కేసీఆర్ ఎలాంటి ప్రయత్నాలు చేశారు?ఎన్ని రకాల ప్రయత్నాలు చేశారనేది..లాగు వేసుకునే బుడ్డోడుకు కూడా తెలుసుకానీ ఎన్ని ప్రయత్నాలు చేసినా సరే వర్కౌట్ కాలేదు?.హుజూరాబాద్‌లో ఈటల గెలుపుని ఆపలేకపోయారు. అయితే ఉపఎన్నిక ముందు కేసీఆర్ ఒక స్ట్రాటజీ వేశారు..అది అందరికీ గుర్తే ఉండి ఉంటుంది. అంటే తానే తోపు సీఎం అన్నట్లుగా డప్పు కొట్టుకున్నారు. టీఆర్ఎస్ ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతూ?తన పాలనని చూసి ఇతర రాష్ట్ర ప్రజలు కూడా ముగ్దులవుతున్నారని, తమకు కూడా తెలంగాణలో అమలయ్యే పథకాలు కావాలని కోరుకుంటున్నారని కేసీఆర్ సెలవిచ్చారు.అసలు తెలంగాణకు బోర్డర్‌లో ఉన్న మహారాష్ట్ర, కర్నాటక ప్రజలు..తెలంగాణకు వచ్చేస్తామని, తమని తెలంగాణలో కలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారని మాట్లాడారు. ఇదే కాదు ఏపీ ప్రజలైతే?అక్కడ కూడా టీఆర్ఎస్ పార్టీ పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. పార్టీ పెడితే చాలు తామే గెలిపించేసుకుంటామని ఏపీ ప్రజలు చెబుతున్నారని కేసీఆర్ ఎడాపెడా డప్పు కొట్టేసుకున్నారు.ఇంకేముంది ఏపీలో టీఆర్ఎస్ పార్టీ పెట్టేస్తున్నారని హడావిడి మొదలైపోయింది. అయితే ఇదంతా డప్పు అని జనాలకు అర్ధమైంది?అంటే తన పాలన సూపర్ అని, ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా కోరుకుంటున్నారని, కాబట్టి తెలంగాణ ప్రజలు అదృష్టంగా భావించాలని అన్నట్లుగా బిల్డప్ ఇచ్చారు. పరోక్షంగా హుజూరాబాద్ ప్రజలని ఆకర్షించడానికి కేసీఆర్?బిల్డప్ బాబాయ్ అవతారం ఎత్తారు. కానీ అదంతా బిల్డప్ అని జనాలకు అర్ధమైంది. అందుకే హుజూరాబాద్ ప్రజలు చిత్తుగా ఓడించి పక్కనబెట్టేశారు. ఏదో ఒకప్పుడు ఈ బిల్డప్‌లు వర్కౌట్ అయ్యాయి గానీ, ఇప్పుడు వర్కౌట్ కావని రుజువు చేశారు.

# ఏపీలో కొత్త లెక్కలు తప్పవా

గుంటూరు, నవంబర్ 9, (న్యూస్ పల్స్)ఏపీలో బలంగా ఉన్న జగన్‌ని ఎదురుకునేందుకు చంద్రబాబు వేయని వ్యూహాలు లేవు?.చేయని రాజకీయం లేదు. జగన్ అధికార పీఠంలో కూర్చున్న దగ్గర నుంచి ఏదొరకంగా జగన్‌ని ఇబ్బంది పెట్టాలనే విధంగా చంద్రబాబు రాజకీయం చేస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో కేంద్రంలో అధికారంలో బీజేపీకి దగ్గవ్వాలని కూడా బాబు చేయని ప్రయత్నం లేదు. కానీ ఏది కూడా వర్కౌట్ కావడం లేదు. ఇటు ఏపీలో జగన్‌ని దెబ్బకొట్టడంలో బాబు పూర్తిగా ఫెయిల్ అవుతున్నారు.అటు బీజేపీకు దగ్గరవ్వడంలో కూడా విఫలమవుతున్నారు. ఏ కోశాన కూడా బాబుని బీజేపీ దగ్గరకు రానివ్వడం లేదు. కానీ ఎన్ని జరిగినా బాబు రాజకీయం వేరు?ఆయన ఒక దారి కాకపోతే మరొకదారిలో వచ్చేస్తారు. ఎలాగైనా జగన్‌ని పడగొట్టాలనే కసితో ఉన్న బాబు, పవన్ కల్యాణ్‌ని దగ్గర చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇటీవల ఆయన చేస్తున్న రాజకీయాలని బట్టి అర్ధమవుతుంది. అటు పవన్ కూడా బాబు విషయంలో కాస్త మెతక వైఖరితోనే ఉన్నారని తెలుస్తోంది.ఇటు బాబు టార్గెట్?అటు పవన్ టార్గెట్?జగన్ మాత్రమే. అందుకే ఈ ఇద్దరు కలవడానికి చూస్తున్నారని తెలుస్తోంది. ఒకవేళ వీరు విడిగా ఉంటే జగన్‌కే బెనిఫిట్. ఆ విషయం గ్రహించిన బాబు?పవన్‌ని దగ్గర చేసుకుంటున్నారు. పవన్ కూడా బాబుకు దగ్గవ్వాలనే చూస్తున్నారు. కానీ పవన్?బీజేపీతో పొత్తులో ఉన్నారు. బీజేపీ మాత్రం బాబుతో కలవమని చెప్పేస్తుంది?అలాగే పవన్‌ని సైతం బాబుకు దగ్గరవ్వనివ్వకుండా ప్రయత్నాలు చేస్తుంది. కానీ బీజేపీ ప్రయత్నాలు పెద్దగా వర్కౌట్ అయ్యేలా లేదు. ఒకవేళ బీజేపీ కలిసొస్తే ఓకే?లేదంటే బీజేపీని సైడ్ చేసి పవన్, కమ్యూనిస్టులతో కలిసి సరికొత్త పొత్తుకు తెరలేపాలని బాబు చూస్తున్నట్లు తెలుస్తోంది.అటు కేంద్రంలో ఎలాగో ఈ సారి బీజేపీకి అనుకున్న మెజారిటీ వచ్చేలా లేదు. ఇటు విపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో బాబు, కాంగ్రెస్‌కు సాయం చేసిన ఆశ్చర్యపోనవసరం లేదు. మొత్తానికైతే బాబు ఏపీ రాజకీయాన్ని ఒకేసారి తిప్పేసేలా ఉన్నారు.

# రసవత్తరంగా స్థానిక పోరు

ఏలూరు నవంబర్ 9, (న్యూస్ పల్స్)పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక పోరు మరింత రసవత్తరం గా మారింది. రోజుకో ఎత్తుగడతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలూ తలో వ్యూహం అమలు చేస్తున్నాయి. అధికార పక్షం దూకుడుకు అడ్డు వేయాలని ప్రతిపక్ష తెలుగుదేశం వ్యూహం రచించింది. ఆకివీడు నగర పంచాయతీలో 20 వార్డులకు ఇన్చార్జను నియమించింది. ఆకివీడు లో టీడీపి 13 వార్డులో జనసేన 6 వార్డులో సిపిఎం రెండు వార్డులలో పోటీ చేస్తున్నాయి. వైసీపీ పార్టి కూడా ఎమ్మెల్యేలు, మంత్రులను దింపబోతోంది. మరోవైపు పెనుగొండ జడ్పీటీసీ స్థానంలో తెలుగుదేశం?జనసేన పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదిరింది. పోటీ నుంచి టీడీపీ తప్పుకుని జనసేనకు మద్దతు ప్రకటించింది. ప్రచారంలో సై అంటే సై అంటూ అధికార పక్షం, ప్రతిపక్ష తెలుగుదేశం?జనసేన పార్టీలు రంగంలోకి దిగాయి. ఎట్టి పరిస్థితుల్లో పెనుగొండ జడ్పిటిసి గెలుచుకోవాలని మంత్రి రంగరాజు పట్టుదలగా ఉండగా టీడీపి మద్దతు తో జనసేన అభ్యర్థిని గెలిపించి తమ సత్తా చాటాలని టిడిపి మాజీమంత్రి పీతాని సత్యనారాయణ ఉన్నారు.

# నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి

చిత్తూరు నవంబర్ 9, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల రైల్వే బ్రిడ్జి కింద నీటి ప్రవాహంలోఒక వ్యక్తి కొట్టుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. విషయాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు పాకాల పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్ లకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కొంత సమయానికి నీటి ప్రవాహంలో కొట్టుకు పోయిన వ్యక్తిని తాడు ల సహాయంతో బయటకు తీశారు.అప్పటికే ఆవ్యక్తి మృతి చెందినట్లుగా గుర్తించారు. ఏ.ఎస్.ఓ విశ్వనాథం,ఫైర్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో తాడుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతి చెందిన వ్యక్తి పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ పచ్చిపాల పల్లికి చెందిన చిట్టిబాబు(55) గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాకాల ఎస్.ఐ వంశీధర్ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో పాకాల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ రెడ్డి, రవి, ఫైర్ సిబ్బంది గుణశేఖర్ రెడ్డి, విశ్వనాథం, చిట్టిబాబు, గిరిబాబు, పళణి, మాధవ, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'నో యాక్సిడెంట్ డే' స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న తూ.గో జిల్లా పోలీసులు




కాకినాడ నవంబర్ 9, (న్యూస్ పల్స్) రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పోలీసులు 'నో యాక్సిడెంట్ డే'స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్డు ప్రమాదాల నియంత్రణ మరియు అవగాహనలో భాగంగా ప్లకార్డులు, బ్యానర్ల పై స్లోగన్ల సహాయంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జాతీయ, రాష్ట్ర హైవే ల పై అవగాహన కల్పిస్తున్నారు. 'నో యాక్సిడెంట్ డే'స్పెషల్ డ్రైవ్ సందర్భంగా సీటు బెల్టు, అతివేగం, ట్రిపుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్.తదితర మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నారు.జిల్లాలో విస్తరించి ఉన్న16, 216 జాతీయ రహదారులను జోన్ ల వారీగా విభజించి సంబంధిత సర్కిల్ ఏరియా ఇన్స్పెక్టర్ స్థాయి అధికారిని అతని జోన్ లో గుర్తించిన బ్లాక్ స్పాట్లు, ప్రమాదాలు జరిగే పాయింట్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు ఆదేశించారు. హైవే మొబైల్స్ వాహనాల సిబ్బంది, జాతీయ హైవే అథారిటీ, ఖీడః శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా చేపట్టవలసిన రోడ్డు ఇంజనీరింగ్, సిగ్నల్ లైట్స్, కాషనరి బోర్డులు, వేగ నియంత్రికలు మొదలగువాటిని ఏర్పాటు చేయాలి. రోడ్డు ప్రమాద రహితంగా జిల్లాలో నుండి వెళ్ళే అన్ని రహదారులను తీసుకువచ్చేలా ఒక నిర్దిష్ట ప్రణాళికను అమలు చేయాలని సూచించారు.

# 34 వ డివిజన్ అభివృద్ధి సంక్షేమానికి షేక్. ఫామీదను గెలిపించాలి

## వైకాపా నేత షేక్. సంసుద్దీన్



నెల్లూరు నవంబర్ 9, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని 34 వ డివిజన్ అభివృద్ధి సంక్షేమానికి ఈ నెల 15న జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక డివిజన్ వైకాపా అభ్యర్థిని షేక్ ఫామీదను ఆదరించి గెలిపించాలని, స్థానిక వైకాపా సీనియర్ నాయకులు షేక్. సంసుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక ప్రగతి నగర్ 5వ వీధి తదితర ప్రాంతాలలో మంగళవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్. రియాజ్ సతీమణి షేక్. ఫామిద ఘన విజయం సాధించే దిశగా స్థానిక ఓటర్లు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ వైకాపా అభ్యర్థిని షేక్. పామిద మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని తన విజయానికి చేయూతనివ్వాలని ఓటర్లను అభ్యర్ధించారు. స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆయన సోదరులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు స్థానిక డివిజన్ ఇంచార్జి షేక్ మస్తాన్ తదితరులు బలపరిచిన అభ్యర్థిగా కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం హర్షనీయం అన్నారు. డివిజన్ పరిధి ప్రజలకు అధికారిక సేవలు అందించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అభివృద్ధి కమిటీ చైర్మన్, అభ్యర్థిని భర్త షేక్ రియాజ్ మరియు స్థానిక డివిజన్ ఇంచార్జి షేక్ మస్తాన్, స్థానిక డివిజన్ వైకాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశానికి పటిష్ట బందోబస్తు

## ఏర్పాటుపై జిల్లా యస్.పి సమీక్ష.

తిరుపతి నవంబర్ 9, (న్యూస్ పల్స్) ఈనెల 14న తిరుపతిలో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా గారి అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరగనుంది. సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పుదుచ్చేరి, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ లెఫ్టినెంట్ గవర్నర్లు కూడా హాజరవుతున్న నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై సమక్షా సమావేశాన్ని జిల్లా యస్.పి వెంకట అప్పల నాయుడు జిల్లా ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమిక్షా నిర్వహించారు. ఈ సమావేశం నిర్వహణ ఏర్పాట్లపై డి.యస్.పి స్థాయి అధికారులను సమన్వయ నోడల్ ఆఫీసర్ గా నియమించి భద్రత పరమైన ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్లకు మరియు బందోబస్తు పర్యవేక్షణ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలపై సమిక్షించారు. ఈ నెల 14వ తేది జిల్లాకు అత్యంత ప్రముఖులు రానున్నందున వారికి భద్రతా పరమైన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రేణిగుంట ఎయిర్ పోర్టు నుండి సమావేశ వేదిక అయిన తాజ్ హోటల్, తిరుమల వరకు ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాంబ్ డిస్పోజల్, యాంటీ సబటేజ్ చెక్ లను జాగ్రత్తగా చేయాలన్నారు. బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది కోవిడ్ నిబందనలను పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రముఖులందరూ తిరుమల శ్రీవారి దర్శనార్థం సూచనలు ఉన్న కారణంగా వారు ప్రయాణించు మార్గంలో ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వేదిక చుట్టుపక్కల ప్రాంతాల యందు సి.సి కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల యందు ప్రత్యేక చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తులనే కాకుండా అసాంఘిక శక్తుల గురించి జిల్లాకు వచ్చు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనికీలు చేపట్టాలన్నారు. మెటల్ డిటెక్టర్ లతో హోటల్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తూ పోలీసు జాగిలాలతో కూడా ప్రముఖులు వెళ్లే దారిలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వచ్చే ఐదు రోజులు జిల్లా ధికారులు, సిబ్బంది క్రమశిక్షనతో కష్టపడి ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రముఖులకు భద్రత కల్పించాలని స్థాయితో పని లేకుండా అందరు కష్టపడి ఈ సమావేశాన్ని విజయవంత చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అయన కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ యస్.పి లు అడ్మిన్ ఇ.సుప్రజా, యల్‌డఓ అరిఫుల్లా, తిరుమల డి.యస్.పి లు యస్.బిజిల్లా డి.యస్.పి లు, ఏ.ఆర్ డి.యస్.పి, కమ్యూనికేషన్ డి.యస్.పి, పాల్గొన్నారు.

# గాంధీకి వినతి పత్రం

అనంతపురం, నవంబర్ 9, (న్యూస్ పల్స్)ఫ్యాక్షన్ గడ్డపై బాంబులు పడ్డాయి.. తలలు పగిలాయి.. సై అంటే సై అంటూ కయ్యాలు కాలు దువ్వుకున్నారు.. కానీ అలాంటి పరవ్ ఫుల్ తాడిపత్రిలో ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఒకప్పుడు రా చూసుకుందాం అన్న జేసీ ప్రభాకర్ రెడ్డి ఇప్పుడు రూట్ మార్చారు. సవాళ్లు లేవ్, ప్రతి సవాళ్లు లేవ్.. ఓన్లీ గాంధీ గిరి అంటున్నారు. మౌనంగా వెళ్లి గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. అలాగే ఆయన సూచించిన స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా చీపుర్లు పట్టి తోటి కౌన్సిలర్లతో రోడ్లు ఊడ్చారు. ఇదంతా దేనికంటే.. తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని ఆయన ఆరోపణ. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు.ప్రోటోకాల్ ప్రకారం మున్సిపల్ ఛైర్మన్ అయిన తనని, అలాగే కౌన్సిలర్లను ఆహ్వానించాల్సి ఉంటుంది. అయితే, తామెవరినీ ఆహ్వానించలేదని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. కమిషనర్ తీరుకు వ్యతిరేకంగానే ఈ గాంధీగిరి చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశంపై ఐదు రోజుల నిరసన తరువాత మాట్లాడుతామని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే మున్సిపల్ కమిషనర్ మాత్రం ఆరోజు అధికారికంగా జరిగిన కార్యక్రమం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి వాటిపై వివాదాలు తగదని అన్నారు. అధికారిక సమావేశాలకు తప్పకుండా ప్రోటోకాల్ పాటిస్తామన్నారు. ఈ వివాదాన్ని మరింత తీవ్ర చేయకుండా అర్థం చేసుకోవాలని కోరారు.

# అత్తారింట ముందుధర్నా

ఏలూరు, నవంబర్ 9, (న్యూస్ పల్స్)ప్రాణంగా ప్రేమించానన్నాడు. పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. కొద్ది రోజులు బాగానే కాపురం చేశాడు. ఆతర్వాత ముఖం చాటేశాడు. ఏం చేయాలో దిక్కుతోచని భార్య.. అత్తింటి ముందే ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని దీనంగా వేడుకుంటోంది. ఈ ఘటన పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దూబచర్లకు చెందిన ప్రవీణ్ కుమార్, ఆరేపల్లి సత్యవతి ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి ఏడాది క్రితం తమ ప్రేమను పెళ్లిపీటలెక్కించారు. కొన్ని రోజులు వీరి సంసారం బాగానే సాగింది. అయితే ఉన్నట్లుండి తన భర్త ముఖం చాటేశాడని బాధితురాలు చెబుతోంది.తన భర్త తనకు కావాలని గతంలో పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది సత్యవతి. కానీ ఎవరూ స్పందించలేదు. దీంతో దిక్కుతోచని ఆమె మంగళవారం అత్తింటి ముందు ఆందోళనకు దిగింది. ఈ విషయం తెలుసుకున్న అత్తామామలు ఆమెను కొట్టి అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయితే తన భర్త తనకు కావాలని, తనకు న్యాయం జరిగే వరకు ఇంటి ముందు నుంచి కదలనని సత్యవతి అక్కడే భీష్మించుకుని కూర్చుంది.

# లిక్కర్... భారీ స్కామ్.. అనధికార విక్రయాలు

## పరారీలో సూపర్‌వైజర్

పిడుగురాళ్ల నవంబర్ 9, (న్యూస్ పల్స్) కంచె చేనుమేసినట్లుగా ప్రభుత్వ మద్యం షాపులో పనిచేసే ఓ ఉద్యోగి మద్యాన్ని పక్కదారి పట్టించి రూ.లక్షల్లో మాయంచేసి ఉడాయించిన ఘటన పిడుగురాళ్లలో వెలుగుచూసింది. నరసరావుపేట ఎక్సైజ్ సీఐ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పిల్లుట్ల రోడ్డులోని ప్రభుత్వ మద్యంషాపులో పట్టణానికి చెందిన కొమ్ము విజయదళపతి సూపర్‌వైజర్‌గా, అశోక్, నాగరాజు, ప్రదీప్‌లు సేల్స్‌మెనగా పనిచేస్తున్నారు. ఎక్సైజ్ సిబ్బంది వారాంతపు తనిఖీల్లో పిల్లుట్ల రోడ్డులోని మద్యంషాపులో మద్యం నిల్వలు, అమ్మకాల వివరాలను పరిశీలించారు. సూపర్‌వైజర్ విజయదళపతి షాపులోని మద్యాన్ని స్కాన చేయకుండా అనధికారికంగా విక్రయాలు జరిపినట్టు తనిఖీల్లో వెల్లడైంది. గత 15రోజులుగా అనధికార విక్రయాల ద్వారా 21,652 మద్యంబాటిళ్లను పక్కదారిపట్టించి సొమ్ముచేసుకున్నట్లు గుర్తించారు. అనధికార మద్యంవిక్రయాల విలువ సుమారు రూ.49,63,730లను సూపర్‌వైజర్ విజయదళపతి సొంతానికి వాడుకున్నట్లు తేలింది. తనిఖీల అనంతరం సేల్స్‌మెన అశోక్, నాగరాజు, ప్రదీప్‌లను అదుపులోకి తీసుకోగా, సూపర్‌వైజర్ విజయ్‌దళపతి పరారీలో ఉన్నట్లు సీఐ బాషా తెలిపారు. షాపులో పనిచేస్తున్న మొత్తం సిబ్బందిపై కేసు నమోదు చేశామన్నారు...!!

# నేను క్షేమంగానే ఉన్నా

అనంతపురం నవంబర్ 9, (న్యూస్ పల్స్)తాను కనిపించడం లేదని వస్తున్న వార్తలపై ఎస్ఎస్ బిఎన్ కళాశాల విద్యార్థిని జయలక్ష్మి వీడియో విడుదల చేసింది. నేను క్షేమంగానే వున్నానని పేర్కొంది. సోమవారం నాడు కాలేజీలో విద్యార్ధులు అందోళనకు దిగడం, పోలీసులు వారిని చెదరగొట్టడం విద్యార్థిని జయలక్ష్మి గాయపడడం తెలిసిందే. జయలక్ష్మి నిన్న రాత్రి నుంచి కనబడడంలేదని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె వీడియో విడుదల చేసింది.

# వక్ఫ్ బోర్డు సీఈవోకు రెండు వారాల జైలు శిక్ష

అమరావతి నవంబర్ 9, (న్యూస్ పల్స్)కోర్టు ధిక్కరణ కేసులో వక్ఫ్ బోర్డ్ సీఈవో అలీం బాషాకు ఏపీ హైకోర్టు రెండు వారాలు జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించింది. వక్ఫ్ బోర్డ్ సీఈవో అలీం బాషా అభ్యర్థన మేరకు రెండు వారాల పాటు హైకోర్టు శిక్ష నిలుపుదల చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో వక్ఫ్ బోర్డ్ సీఈవో అలీం బాషాకు హైకోర్టు రెండు వారాల సాధారణ జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే మూడు రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఈ తీర్పుపై అప్పీలు దాఖలు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ...తీర్పు అమలును రెండు వారాలు నిలుపుదల చేశారు. కర్నూలు జిల్లా అల్లూరు మండలం మె?లగవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 662 లో ఉన్న 18 ఎకరాలను ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వక్ఫ్ బోర్డు సీఈవోను 2019 డిసెంబర్లో హైకోర్టు ఆదేశించింది. సీఈవో ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవటంతో బి. శివానందం అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి సీఈవో ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని పేర్కొంటూ జైలు శిక్ష విధించారు.

# పాడేరు డివిజన్ లో గంజాయి పంట ధ్వంసం

విశాఖపట్నం నవంబర్ 9, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లా చింతపల్లి, పాడేరు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు 53 ఎక రాలలో గంజాయిపంటను ధ్వంసం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుంకుమపూడి గ్రామస్తులు ఐదు ఎకరాలలో ఉన్న గంజాయి పంటను గ్రామస్థులు స్వచ్ఛందంగా ధ్వంసం చేశారు. ఆపరే షన్ పరివర్తనలో భాగంగా విశాఖ ఏజె న్సీలో గంజాయి తోటలు ధ్వసంమే లక్ష్యంగా, చింతపల్లి పాడేరు పోలీసు లు తనిఖీలు చేస్తున్నారు. జి.కె.వీ ధి మండలం గూడెం పంచాయతీ అతి మారుమూల మావోయిస్టు ప్రభా విత ప్రాంతమైన కుంకుమపూడి గ్రామా నికి సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ సమీర్ వెళ్లి గ్రామస్తులకు గంజాయి సాగుతో కలిగే దుష్పరిణామాలు పై అవగాహనా కల్పించారు. దాంతో కుంకు మపూడి గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఐదు ఎకరాలలో ఉన్న గంజాయి పంటను ధ్వంసం చేశారు.

## విద్యార్థులపై దాడికి నిరసనగా విద్యార్థి సంఘాల ధర్నా

విజయవాడ, నవంబర్ 9, (న్యూస్ పల్స్)అనంతపురం ఎస్ ఎస్ బి ఎన్ కళాశాల విద్యార్థులపై పోలీసుల దాడులకు నిరసనగా పీ డీ ఎస్ యూ,ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ ఎస్ యు ఐ, పి డి ఎస్ యు విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్ సెంటర్ లో ధర్నా జరిగింది.ఈ సందర్భంగా పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్సన్ బాబు,టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎం. రామకృష్ణలు మాట్లాడుతూ- విద్యార్థులపై పోలీసుల దాడి అన్యాయమన్నారు.ఇది ముమ్మాటికీ ప్రభుత్వ దాడి అని దుయ్యబట్టారు.ఎయిడెడ్ విద్యాసంస్థలను యథాతథంగా కొనసాగించాలని విద్యార్థులు ఆందోళన చేస్తుంటే జగన్ ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడం హేయమైన చర్య అని విమర్శించారు.ఎయిడెడ్ రద్దు చేయడం ద్వారా ఫీజుల భారం విద్యార్థులపై అధికంగా ఉంటుందన్నారు.మామయ్యగా అండగా ఉంటానని చెప్పిన జగన్ విద్యార్థులను చితకబాదించడం తీవ్ర గర్హనీయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.గత అనేక రోజుల నుండి విద్యార్థులు ఎయిడెడ్ విద్యాసంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని తెలిపారు.అయినా జగన్ ప్రభుత్వం మొండిగా ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు.జీవోలు 42,52,35 లను తక్షణవే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఎయిడెడ్ విద్యా సంస్థలను యథాతథంగా కొనసాగించేంత వరకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ నగర అధ్యక్షులు ఐ. రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సాయి కుమార్,టిఎన్ ఎన్ఎఫ్ నాయకులు బాబి,వంశీకృష్ణ,భాను తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు డీజిల్ పై ధరలు తగ్గించాలని నిరసనలు

## రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ సుంకం పూర్తిగా రద్దు చేయాలి
## టీడీపీ డిమాండ్

కౌతాళం నవంబర్ 9, (( విభారె) పెట్రోల్ డీజిల్ పై కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం స్వాగతిస్తున్నాం, అదేవిధంగా ఏపీ లో జగన్ ప్రభుత్వం కూడా పెట్రోల్ డీజిల్ పై పన్ను పూర్తిగా తగ్గించి, ప్రజలకు కొంత ఉపశమనం కల్పించాలి, కేంద్రం డీజిల్, పెట్రోల్ పన్నులను వ్యాట్ నుండి, జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి పన్నుల భారాన్ని తగ్గించాలని జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు చెన్న బసప్ప డిమాండ్ చేశారు.జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పాదయాత్రలో ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ డీజిల్ బాదుడే బాదుడు అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పెట్రోల్ డీజిల్ పైన అధిక భారం మోపి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ రేట్లు తగ్గాలంటే జగన్ పోవాలి అనే నినాదంతో ఆదోని రోడ్డు మరియు బాపురం రోడ్డు పెట్రోల్ బంకు వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు చెన్న బసప్ప గారు రాష్ట్ర రైతు సంఘము కార్యదర్శి ఆడి వప్ప గౌడ వెంకటపతి రాజు ,సుధీర్ రెడ్డి ,టిప్పుసుల్తాన్, కురుగోడు,రమేష్ గౌడ్, ఉరుకుంద సురేంద్ర, హల్వి మౌలా క త్రికి చంద్రశేఖర్ రామలింగ ',రంగస్వామి, విశ్వనాథ్ ,మంజు, కురువ వీరేశ్, రహిమాన్ డాక్టర్ నందు, దొడ్డన గౌడ్, గణేష్ ,మారెప్ప శంకరప్ప ,కృష్ణ ,సిద్ధూ, ,సునీల్, రాజబాబు ,వీరేశ్ ,దేవేంద్ర, నీలకంఠా రెడ్డి , బుడ దొడ్డి ఎరిగేరి వీరేష్ ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్లింలపై దాడులు అరికట్టాలి

## త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

నందికొట్కూరు. నవంబర్ 9, (( విభారె) త్రిపుర రాష్ట్రంలో ముస్లింలపైనే గాకుండా వారి ఆస్తులు, మసీదులను పనిగట్టుకుని ధ్వంసం చేస్తున్నారని వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని మంగళవారం ఎఐఎంఐఎం నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షులు మహమ్మద్ అలీ డిమాండ్ చేశారు. త్రిపుర రాష్ట్రంలో ముస్లింలపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలు, దళితులు, మైనార్టీలపై దాడులకు తెగబడుతోందన్నారు. పైపెచ్చు వారి ఆస్తులను కూడా ధ్వంసంచేయడం దారణమన్నారు. మనదేశం సర్వమతాలకు నిలయంగా ఖ్యాతిగాంచిందని, ఐకమత్యంతో అన్నదమ్ములవలే వెలుగుతున్న ముస్లింలను వేరుచేయాలనే ఎత్తుగడ సరైందికాదన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం జోక్యంచేసుకొని త్రిపురలో ఇబ్బందులు పడుతున్న ముస్లింలకు అండగా నిలిచి ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని , ముస్లిములపై దాడులు దారుణమని అన్నారు. ముస్లిం ఆస్తులపై, మసీదులపై, ఇమామ్ మూలపై దాడులు చేయడం శోచనీయమన్నారు.ఇలాంటి చర్యలు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో ముస్లిములపై దాడులు చేస్తున్నా రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటు అన్నారు. మైనార్టీ ఓట్లతో గద్దెనెక్కిన రాజకీయ పార్టీలు వారిపై జరుగుతున్న దాడులు ఖండించక పోవడం శోచనీయమన్నారు. ముస్లిములకు సమస్యలు వచ్చినప్పుడు ఏ రాజకీయ పార్టీ నేతలు కూడా స్పందించకపోవడం చాలా బాధాకరం అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ముస్లిం మైనారిటీ లీడర్లు, ప్రతిపక్షంలో ఉన్న మైనార్టీ రాజకీయ నాయకులు ఖండించకపోవడం మరి బాధాకరమైన అని తెలిపారు. భవిష్యత్తులో ఇలాగే ముస్లింలపై దాడులు చేస్తూ ఉంటే తీవ్ర ఉద్యమానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎంఐఎం పార్టీ నాయకులు 7వ వార్డ్ ఇంచార్జి షేక్ గని మౌలాలి, 8వ వార్డు ఇంచార్జి ఫరూక్. హాఫీజ్ అబ్దుల్ సలాం, చాంద్ భాష, యూత్ నాయకులు అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మినుము విత్తనాలతో మోసపోయిన రైతులు....

## నకిలీ మినుము విత్తనాలు సరఫరా చేసిన పల్లవి సీడ్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు నవంబర్ 9( విభారె) నందికొట్కూరు మండలంలోని మద్దిగట్ల గ్రామ పొలిమేరలో దాదాపు 50 ఎకరాల్లో నకిలీ మినుము విత్తనాలు వేసి రైతులు మోసపోయారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి పకీర్ సాహెబ్, రైతు సంఘం జిల్లా నాయకులు బెస్త రాజు ఆవేదన వ్యక్తం చేశారు, మంగళవారం సిపిఎం బృందం రైతులు వేసిన మినుము పంట లను పరిశీలించడం జరిగింది, ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరరావు కార్మిక సంఘం జిల్లా నాయకులు పి పకీరు సాహెబ్ రైతు సంఘం జిల్లా నాయకులు బెస్త రాజు మాట్లాడుతూ మద్దిగట్ల గ్రామ పొలిమేరలో రైతులు ఎస్ మా భాష బి వెంకటేశ్వర్లు పల్లవి సీడ్స యజమాని నాగేశ్వర్ రెడ్డి వద్ద ఎన్ సి టీ 9 రకానికి చెందిన మినుములను గత 70 రోజుల క్రితం కొనుగోలు చేసి పొలంలో విత్తనాలు వేశారు పంటకాలం 90 రోజులకు పంట చేతికి వస్తుంది కానీ 70 రోజులు అయినప్పటికీ పూత పిందె కాయలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు పంట చేతికి రాకపోతే ఎకరాకు 50 వేల చొప్పున నష్టపోవాల్సి వస్తుందని చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు శరణ్యమని రైతులు వాపోయారు తక్షణమే నష్టపోయిన రైతులకు ఎకరాకు 50వేల రూపాయలు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు పల్లవి సీడ్స్ యజమాని నుండి ప్రతి ఏటా రైతులు విత్తనాలు తీసుకుని నష్టపోతున్నారు వ్యవసాయ అధికారులు అతనిపై చర్యలు తీసుకోవడం లేదు అన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లవి సీడ్స్ యజమాని పై చర్యలు తీసుకొని షాపు సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి ఓబులేష్ సుధాకర్ రైతులు మురళి రెడ్డి ఎస్ అలీ తదితరులు పాల్గొన్నారు

# పాలు తాగేవారు బరువు తగ్గగలరా? స్టడీలో షాకింగ్ ఫలితాలు ఏం చెబుతున్నాయో తెలుసా?



బరువు తగ్గాలనుకునే వ్యక్తులు ఆహారం మరియు పానీయాల గురించి అనేక ప్రశ్నలు మరియు డైటింగ్ సమయంలో నివారించాల్సిన ఆహారాల గురించి అనేక సందేహాలను కలిగి ఉంటారు. ముఖ్యంగా పాలు తాగడంపై అనేక సందేహాలు తలెత్తే అవకాశం ఉంది, ఎందుకంటే పాలు మన దైనందిన జీవితంలో ఒక భాగం. పాలు ఆరోగ్యకరం, అందులో ఎటువంటి సందేహం లేదు. కానీ ఇది కొవ్వులో కూడా ఎక్కువగా ఉంటుంది, ఇది బరువు పెరుగుటతో సంబంధం ఉన్న మాక్రోన్యూట్రియెంట్. కాబట్టి బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నప్పుడు దానిని నివారించాలా అనేది చాలా మంది ప్రశ్న? ఈ ప్రశ్నకు సమాధానం ఈ పోస్ట్లో మీరు చూడవచ్చు. బరువు తగ్గడానికి పాలు మంచిది కాదని ప్రజలు ఎందుకు అనుకుంటారు? బరువు తగ్గడానికి పాలు మంచిది కాదని ప్రజలు ఎందుకు అనుకుంటారు? పాలలో సంతృప్త కొవ్వు ఉంటుంది మరియు కేలరీలు అధికంగా ఉంటాయి, ఇవి బరువు తగ్గే విషయంలో విస్మరించలేని రెండు అంశాలు. 250 ఎశ్రీ మొత్తం పాలు (1 కప్పు) సుమారు 5 గ్రాముల కొవ్వు మరియు 152 కేలరీలు కలిగి ఉ ంటుంది. ముఖ్యంగా తక్కువ కేలరీల ఆహారం తీసుకునే వారు, రోజుకు తక్కువ కేలరీలు తీసుకోవడానికి వారి ఆహారంలో పాలు మరియు పాల ఉ త్పత్తులను నివారించండి. హీరో ధనుష్ డైట్ అండ్ ఫిట్ నెస్ సీక్రెట్స్ ఏంటో తెలుసుకుందామా...హీరో ధనుష్ డైట్ అండ్ ఫిట్ నెస్ సీక్రెట్స్ ఏంటో తెలుసుకుందామా... కాల్షియం కాల్షియం కాల్షియం, ఎముకలు మరియు దంతాల నిర్మాణంతో పాటు, బరువు తగ్గడానికి కూడా ఇది సహాయపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, కాల్షియం మరియు విటమిన్ డి యొక్క కంటెంట్ జీవక్రియను పెంచడం ద్వారా శరీరంలో కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. కింగ్ కోహ్లీ చేసే ఈ వర్కవుట్లతో మీ బాడీని ఎల్లప్పుడూ ఫిట్ గా ఉంచుకోవచ్చు..: కింగ్ కోహ్లీ చేసే ఈ వర్కవుట్లతో మీ బాడీని ఎల్లప్పుడూ ఫిట్ గా ఉంచుకోవచ్చు... ఆకలిని నియంత్రిస్తుంది ఆకలిని నియంత్రిస్తుంది మిల్క్ పెప్టైడ్ ఖజజ అనే ఆకలిని అణిచివేసే హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, ఇది మిమ్మల్ని చాలా కాలం పాటు నిండుగా ఉంచుతుంది. ఒక కప్పు మొత్తం పాలలో 8.14 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ప్రోటీన్ తీసుకోవడం జీవక్రియను పెంచుతుంది, సంతృప్తిని పెంచుతుంది, పొట్ట కొవ్వును తగ్గిస్తుంది మరియు రక్తపోటును తగ్గిస్తుంది.

అధిక బరువు ఉన్నవారిలో ఎలాంటి లైంగిక సమస్యలు వస్తాయో తెలుసా? అధిక బరువు ఉన్నవారిలో ఎలాంటి లైంగిక సమస్యలు వస్తాయో తెలుసా? పాలు బరువు పెరగడానికి దారితీస్తుందా? పాలు బరువు పెరగడానికి దారితీస్తుందా? దీనికి సమాధానం లేదు. పాలు బరువు పెరగడానికి దారితీయవు మరియు వాస్తవానికి, ఇది కొన్నింటిని కోల్పోవడానికి మీకు సహాయపడుతుంది. పాలు ఒక ఆరోగ్యకరమైన మరియు అధిక నాణ్యత గల ప్రోటీన్ మూలం, ఇది కండరాల నిర్మాణానికి మరియు కండరాల నిర్మాణానికి అవసరమైనది. ఇందులో జింక్, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ బి12 మరియు విటమిన్ డి వంటి పోషకాలు సహేతుకమైన మొత్తంలో ఉంటాయి. ఈ పోషకాలు మీ ఎముకలను బలోపేతం చేయడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి మరియు జీవక్రియను పెంచడానికి సహాయపడతాయి. 250 మి.లీ పాలలో 8 గ్రా ప్రోటీన్లు మరియు 125 మి.గ్రా కాల్షియం ఉంటుంది. కాబట్టి ఆహారంలో కూడా పాలు తక్కువ మోతాదులో రోజూ తీసుకోవడం వల్ల ఎలాంటి హాని ఉండదు. అధ్యయనం ఏం చెబుతోంది? అధ్యయనం ఏం చెబుతోంది? 2004 అధ్యయనం ప్రకారం, పాల ఉత్పత్తులను నివారించే వారి కంటే తక్కువ కేలరీల ఆహారాన్ని అనుసరించే వ్యక్తులు రోజుకు మూడు సార్లు పాల ఉత్పత్తులను తిన్నప్పుడు ఎక్కువ బరువు కోల్పోతారు. డైరీ ప్రొడక్ట్స్ అధికంగా ఉండే డైట్ని అనుసరించే వ్యక్తులు వాటిని కోల్పోయిన తర్వాత వారి బరువును మెరుగ్గా నిర్వహించగలరని మరియు వారి నడుము చుట్టుకొలత తక్కువగా ఉంటుందని అనేక అధ్యయనాలు చూపిస్తున్నాయి. అదనంగా, కాల్షియం తీసుకోవడం ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, టైప్-2 మధుమేహం మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నేను పాలు తాగవచ్చా? చేయకూడదు నేను పాలు తాగవచ్చా? చేయకూడదు మీరు బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నట్లయితే, మీరు మీ ఆహారం నుండి పాలు మరియు పాల ఉత్పత్తులను తగ్గించాల్సిన అవసరం లేదు. పాలు సమతుల్య ఆహారంలో ముఖ్యమైన భాగం, మరియు రోజూ ఒక కప్పు పాలు లేదా 250 మి.లీ పాలు తాగడం వల్ల మిమ్మల్ని శక్తివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీరు మీ వ్యాయామం తర్వాత ప్రోటీన్ షేక్ తీసుకుంటే, దానిని పాలలో జోడించండి. మీరు లాక్టోస్ అసహనంతో ఉంటే, మీరు పాలకు దూరంగా ఉండాలి. అటువంటి సందర్భాలలో, మీరు సోయా మరియు గింజ పాలు వంటి మొక్కల ఆధారిత పాల ఉత్పత్తులను తినవచ్చు.

# టీమిండియా ఆటగాళ్లేమైనా యంత్రాలా, పెట్రోల్ పోసి నడపడానికి..?

టీమిండియా హెడ్ కోచ్గా రవిశాస్త్రి శకం టీ20 ప్రపంచకప్-2021తో ముగిసింది. మెగా టోర్నీలో భాగంగా నవంబర్ 8న నమీబియాతో జరిగిన మ్యాచ్కు రవిశాస్త్రి చివరిసారిగా కోచింగ్ సేవలను అందించాడు. ఈ మ్యాచ్లో టీమిండియా పసికూన నమీబియాపై ఘన విజయం సాధించి కోచ్గా రవిశాస్త్రికి, టీ20 కెప్టెన్గా విరాట్ కోహ్లికి ఘనంగా వీడ్కోలు పలికింది. మ్యాచ్ అనంతరం స్టార్ స్పోర్ట్స్తో మాట్లాడిన రవిశాస్త్రి.. బీసీసీఐ, ఐసీసీలపై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుత ప్రపంచకప్లో టీమిండియా వైఫల్యాలపై మాట్లాడుతూ.. అందుకు పరోక్ష కారణమైన బీసీసీఐ, ఐసీసీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. గత ఆరు నెలలుగా బయోబబుల్లో ఉన్న టీమిండియా ఆటగాళ్లు ఫిజికల్గా, మెంటల్గా అలసిపోయారని.. ఆటగాళ్లు కూడా మనుషులే అన్న విషయాన్ని క్రికెట్ బోర్డులు, అభిమానులు గుర్తించాలని అన్నాడు.

# 'గుడ్ లక్ సఖి' నుంచి 'బ్యాడ్ లక్ సఖి' సాంగ్..!

మహానటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో రూపొందిన లేడీ ఓరియెంటెడ్ మూవీ "గుడ్ లక్ సఖి". స్పోర్ట్స్ డ్రామా బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ సినిమాలో కీర్తి రైఫిల్ షూటర్ గా కనిపించనుంది. ఇందులో ఆది పినిశెట్టి మేల్ లీడ్ పోషించగా.. జగపతి బాబు కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - టీజర్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. తెలుగు తమిళ మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నవంబరు 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.




ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ మొదలు పెట్టారు."గుడ్ లక్ సఖి" చిత్రం నుంచి 'బ్యాడ్ లక్ సఖి' అనే ఫుల్ వీడియో సాంగ్ ను హీరో రానా దగ్గుబాటి విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'అదిగో వస్తుంది బ్యాడ్ లక్ సఖి..' అంటూ సాగిన ఈ పాట సినిమాలో కీర్తి సురేశ్ పాత్ర గురించి తెలియజేస్తోంది. ఆ గ్రామం మొత్తానికి కీర్తి ఒక దురదృష్టవంతురాలని వివరిస్తూ.. దానికి సంబంధించిన సంఘటనలను ఫన్నీగా చూపించారు. పల్లెటూరి అమ్మాయిగా కీర్తి సురేష్ చాలా అందంగా కనిపిస్తుంది.రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సమకూర్చిన పెప్పీ ట్యూన్ కు గేయ రచయిత శ్రీమణి యొక్క హ్యూమరస్ లిరిక్స్ ఈ పాటను ఆసక్తికరంగా ఫన్నీగా మార్చాయి. హరిప్రియ - సమీరా భరద్వాజ్ - ఎంఎ ల్ఆర్ కార్తికేయన్ ఈ గీతాన్ని ఆలపించారు. చిరంతాన్ దాస్ దీనికి సినిమాటోగ్రఫీ అందిం చారు. బ్యాడ్ లక్ సఖి పాట వీక్షక ులను విశేషంగా అలరి ంచడమే కాకుండా.. సినిమాపై ఆసక్తిని కలిగిస్తోంది.కాగా "గుడ్ లక్ సఖి" చిత్రానికి విలక్షణ దర్శకుడు నగేష్ కుకునూర్ దర్శకత్వం వహించారు. ఓ గ్రామీణ యువతి అంతర్జాతీయ షూటర్ గా ఎలా మారిందనే కథా ంశంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. దిల్ రాజ్ సమర్పణ లో 'వర్త్ ఏ షాట్ మోషన్ ఆర్ట్స్ ప్రొడక్షన్' బ్యాన ర్ పై సుధీర్ చంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రావ్యా వర్మ దీ నికి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు.

# మారేడుమిల్లి అడవిలో రామారావు ఆన్ డ్యూటీలో

మాస్ రాజా రవితేజ బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. వరుసగా ఐదు ప్రాజెక్ట్ ల్ని లైన్ లో పెట్టి పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే 'ఖిలాడీ' షూటింగ్ పూర్తిచేసారు. ప్రస్తుతం 'రామారావు ఆన్ డ్యూటీ'ని పూర్తిచేసే పనిలో ఉన్నారు. శరత్ మండవ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ పూర్తయింది. హైదరబాద్..వైజాగ్ సహా వివిధ ప్రదేశాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. తాజా సమాచారం ప్రకారం రామారావు చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఆదివారం నుంచి చివరి షెడ్యూల్ ని తూర్పుగోదావరి జిల్లా మారేడు మిల్లి అడవి అందాల నడుమ ప్రారంభించారు.ఇక్కడ భీకర అడవుల్లో కీలక థ్రిల్లింగ్ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. కొన్ని రోజుల పాటు యూనిట్ ఇక్కడే షూటింగ్ చేయనుంది. రవితేజతో పాటు కీలక పాత్రధారులంతా షూట్ లో పాల్గొంటున్నారు. సినిమాలో ఈ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. మారేడుమిల్లి అందాలు సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తాయని తెలుస్తోంది. మారేడుమిల్లి లోకేషనస్ ఆన్ స్క్రీన్ ఎంతో అందంగా కనిపిస్తాయి. పచ్చని చెట్లు...ఘాట్ రోడ్లు..జలపాతాల నడుమ అక్కడి అందాలు అద్భుతంగా ఉ ంటాయి. రామారావు ఆన్ డ్యూటీ షూట్ లో భాగంగా అక్కడ ఏకంగా ఒక షెడ్యూల్ నే ప్లాన్ చేసారంటే మారేడుమిల్లి ప్రత్యేకత ఏంటో అర్ధమవుతోంది. ఇంతకుముందు పుష్ప షూటింగ్ చాలా భాగం మారేడుమిల్లి అడవుల్లో గిరిజనుల నడుమ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రవితేజ అదే లొకేషన్ లో పని చేయడం ఆసక్తికరం. ఈ షెడ్యూల్ తో షూటింగ్ పూర్తవుతుంది.



అనంతరం పాటల చిత్రీకరణ కోసం యూనిట్ విదేశాలు వెళ్లనుంది. ఇందులో రవితేజ ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో నటిస్తున్నారు. ఆయనకు జోడీగా దివ్యాంశకౌశిక్..రజిషా విజయన్ నటిస్తున్నారు. అలాగే వేణు తొట్టెంపూడి చాలా గ్యాప్ తర్వాత మళ్లీ ఈ చిత్రంతో కంబ్యాక్ అవ్వడం విశేషం. సుధాకర్ చెరుకూరి-రవితేజ సంయుక్తంగాఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# వల్గర్ ప్రశ్నకు స్వీట్ సమాధానం.. హీరోయిన్ సూపర్

సెలబ్రెటీలు ఎంత ఎక్కువగా సోషల్ మీడియాలో ఉంటే అంతగా వారికి పాపులారిటీ దక్కి అవకాశాలు వస్తున్నాయి. అందుకే పెద్ద ఎత్తున అవకాశాల కోసం సెలబ్రెటీలు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్నారు. ముఖ్యంగా హీరోయిన్స్ సోషల్ మీడియాలో తమ హాట్ అందాలతో ముంచెత్తుతున్నారు. ఎంతో మంది హీరోయిన్స్ ప్రతి రోజు తమ హాట్ ఫొటో షూట్స్ ను షేర్ చేయడంతో పాటు



రెగ్యులర్ గా అభిమానులతో టచ్ లో ఉంటున్నారు. చాలా సందర్బాల్లో హీరోయిన్స్ అభిమానులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పే కార్యక్రమం పెట్టుకుంటూ ఉంటారు. ఆస్క్ మీ ఎనీథింగ్ అంటూ అభిమానుల నుండి ప్రశ్నలు కోరడం.. వాటికి సమాధానాలు చెప్పడం హీరోయిన్స్ చేసే చాలా కామన్ విషయాలు అయ్యాయి.హీరోయిన్స్ కొన్ని సార్లు బ్యాడ్ క్వశ్చన్స్.. వల్గర్ క్వశ్చన్స్ ను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటి వాటిని కొందరు స్కిప్ చేస్తే.. మరి కొందరు మాత్రం ఆ ప్రశ్నలకు సీరియస్ గా రియాక్ట్ అవుతారు. కొందరు మాత్రం అలాంటి ప్రశ్నలను కూడా లైట్ తీసుకుని చాలా సరదాగా హుందాగా సమాధానాలు చెప్తారు. తాజాగా బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన అభిమాని పట్ల వ్యవహరించిన తీరు అందరి ప్రశంసలు దక్కించుకుంది. వల్గర్ ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం చాలా స్వీట్ గా ఉందంటూ అంతా కూడా ప్రశంసలు కురిపించారు. నిజంగా సూపర్ అంటూ ఆమెను ఆకాశానికి ఎత్తేస్తున్నారు.ఇంతకు ఆ ఫ్యాన్ అడిగింది ఏంటీ.. ఆమె చెప్పిన సమాధానం ఏంటీ అంటే... అతడు నీ ఫిగర్ సైజ్ ఎంత అంటూ ప్రశ్నించాడు. ఏ ప్రశ్న అయిన అడగవచ్చు అన్నది కనుక ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే. ఆ ఉద్దేశ్యంతోనే దిశా పటాని ఆ ప్రశ్నకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చింది. ఆ ప్రశ్నను స్కిప్ చేయకుండా ఒక ఫన్నీ పాండ జిఫ్ వీడియోను షేర్ చేసింది. ఆ వీడియో లో పాండ ఫన్నీగా ఉండటంతో ఆ ప్రశ్నను ఆమె చాలా తేలికగా తీసుకున్నట్లుగా చెప్పకనే చెప్పింది. తెలుగు లో లోఫర్ సినిమాను చేసి ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ ఆ తర్వాత బాలీవుడ్ కు పరిమితం అయ్యింది. తెలుగు నుండి ఆఫర్లు వచ్చినా కూడా పట్టించుకోవడం లేదు. ముందు ముందు అయినా ఈమె తెలుగు లో సినిమా చేస్తుందేమో చూడాలి.

# రౌడీ బాబు ఇది నిజమేనా?

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ తాజా ఇంటర్వ్యూలో బాంబు పేల్చాడు. తమ్ముడు ఆనంద్ దేవరకొండ హీరోగా తన నిర్మాణంలో రూపొందిన పుష్పక విమానం సినిమా విడుదల కు సిద్ధం అయ్యింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా కొన్ని రోజుల క్రితం తమ్ముడితో కలిసి చిట్ చాట్ చేస్తూ ఒక వీడియోను విడుదల చేశాడు. ఆ వీడియో చాలా వైరల్ అయ్యింది. మళ్లీ ఇప్పుడు సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న ఈ సమయంలో మరో వీడియోను రౌడీ బ్రదర్స్ షేర్ చేశారు. ఇద్దరు అన్నదమ్ములు కలిసి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను గురించి మాట్లాడారు. ఆ సందర్బంగానే విజయ్ దేవరకొండ సింగిల్ గా



ఉన్నాడా లేదా మింగిల్ అయ్యి ఉన్నాడా అంటూ ఒక ప్రశ్న వచ్చింది. ఆ సమయంలో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి.మొన్నటి వరకు మింగిల్ గా ఉన్న తాను ఇప్పుడు సింగిల్ అయ్యాను. నాకు ఇటీవలే బ్రేకప్ అయ్యింది అంటూ విజయ్ దేవరకొండ ప్రకటించాడు. ఇప్పటి వరకు ఈ విషయం ఎవరికి తెలియదు అన్నాడు. విజయ్ దేవరకొండ ప్రేమలో ఉన్నాడు అంటూ ఆమధ్య పుకార్లు షికార్లు చేశాయి. రష్మికతో అని.. ఒక ఇంగ్లీష్ అమ్మాయితో అంటూ ప్రచారం జరిగింది. కాని అవేవి నిజం కాదని ఆ తర్వాత తర్వాత క్లారిటీ ఇచ్చారు. కాని విజయ్ దేవరకొండ ఎవరితో ప్రేమలో ఉన్నాడని ఇప్పుడు బ్రేకప్ అయ్యాడు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అసలు రౌడీ చెప్పింది నిజమేనా అనే అనుమానాలు కొందరు వ్యక్తం చేస్తుంటే మరి కొందరు మాత్రం రౌడీ స్టార్ కు బ్రేకప్ శుభాకాంక్షలను ఫన్నీగా చెప్తున్నాడు.విజయ్ దేవరకొండ బ్రేకప్ ప్రకటన పబ్లిసిటీ స్టంట్ అంటూ కొందరు చర్చించుకుంటున్నారు. తమ్ముడు ఆనంద్ దేవరకొండ సినిమా పుష్పక విమానం పబ్లిసిటీ కోసం ఇలాంటి జిమ్మిక్కులను రౌడీ స్టార్ ప్రయోగిస్తున్నాడేమో అంటూ కొందరు కామెంట్స్ చేస్తుంటే మరి కొందరు మాత్రం ఇండస్ట్రీలో ఇవన్నీ కామన్ కదా అంటున్నారు. మొత్తానికి విజయ్ దేవరకొండ బ్రేకప్ విషయం హాట్ టాపిక్ అయ్యింది. చిన్న లీక్ ఇచ్చి వదిలిన రౌడీ ఇప్పుడు ఆ టాపిక్ పెద్దగా అవ్వడంతో సైలెంట్ అయ్యాడు. జనాలు మాత్రం ఇష్టానుసారంగా ఆ లీక్ ను విస్తరిస్తూ ఎవరికి తోచిన విధంగా వారు ఊహించేసుకుంటున్నారు. ఇది ఎంత దూరం వెళ్తుందో అనేది చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190